RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in | rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 275 | 27 గురువారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## కొండెక్కిన చక్కెర ధరలు..

### దేశంలో చక్కెర కొరత లేదన్న కేంద్రం



**న్యూఢిల్లీ, ఆగస్టు 26 రాజధాని వాయిస్:** దేశంలో చక్కెర కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ డిమాండ్‌ను తీర్చేందుకు తగినంత చక్కెర నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఇథనాల్ ఉత్పత్తికి చక్కెర మళ్లింపు తగ్గిందని, ప్రస్తుత ధరల పెరుగుదలకు ఇథనాల్ కార్యక్రమం కారణం కాదని పేర్కొంది. 2022–23లో ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన చక్కెర వాటా సుమారు 12 శాతం ఉండగా.. 2025–26లో అది 9 శాతానికి తగ్గిందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడొంతుల వాటా ధాన్యాలు, ముఖ్యంగా మొక్కజొన్న నుంచే వస్తోందని వివరించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల చక్కెర ధరలు గణనీయంగా పెరిగాయి. జులై 20న కిలో రూ.48.18గా ఉన్న చక్కెర ధర ఆగస్టు 20 నాటికి రూ.55.70కు చేరింది. అంటే నెల రోజుల్లో సుమారు 15.6 శాతం పెరిగింది. అయితే 2024 ఆగస్టు నుంచి 2026 జులై వరకు వినియోగదారుల రిటైల్ చక్కెర ధరలు ఏటా సగటున కేవలం 3 శాతం మేర మాత్రమే పెరిగాయని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత ధరల పెరుగుదలకు దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం, పండుగల సీజన్‌కు ముందు డిమాండ్ పెరగడం, అధిక వర్షాలతో చెరకు పంట దెబ్బతినడం వంటి కారణాలు ఉన్నాయని వివరించింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి తెగుళ్లతో పాటు నీటిముంపు కారణంగా ఉత్పత్తిపై ప్రభావం పడిందని పేర్కొంది. అంతర్జాతీయంగా చక్కెర సరఫరాలు తగ్గడం, ధరలు పెరగడం, కొందరు వ్యాపారులు నిల్వలు చేయడం, మార్కెట్‌లో - మిగతా 2లో..

## దేశంలో హెచ్1ఎన్1 విజృంభణ..

### మళ్లీ మాస్కులు ధరించాల్సిందేనా?



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 26 :** దేశంలోని పలు ప్రాంతాల్లో హెచ్1ఎన్1 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించాలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రతి ఒక్కరూ రోజంతా మాస్క్ ధరించాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. రద్దీగా ఉండే మెట్రోలు, ఆసుపత్రులు, కిక్కిరిసిన వెయిటింగ్ రూమ్‌లు, గాలి ప్రసరణ సరిగా లేని ఇండోర్ ప్రాంతాల్లో మాస్క్ ఉపయోగించడం అదనపు రక్షణ అందిస్తుంది. ముఖ్యంగా జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలున్న వారు ఇతరులకు దూరంగా ఉండటంతో పాటు బయటకు వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. హెచ్1ఎన్1 శ్వాసకోశ కణాల ద్వారా వ్యాపిస్తుంది. అందువల్ల గాలి ప్రసరణ బాగా ఉండే ప్రదేశాలతో పోలిస్తే రద్దీగా, మూసి ఉన్న ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అధిక రక్షణ కోసం సరైన విధంగా అమర్చిన ఎన్95 మాస్క్ ఉపయోగపడుతుంది. అయితే మాస్క్ ధరించడం మాత్రమే పూర్తి రక్షణ కాదని, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండటం, గదుల్లో గాలి ప్రసరణ మెరుగుపరచడం, దగ్గు–తుమ్ముల సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి చర్యలు కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఉన్నవారు హెచ్1ఎన్1 విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్ర బలహీనత, నిరంతర అధిక జ్వరం, ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం హెచ్1ఎన్1 కేసుల పెరుగుదల కొత్త మహమ్మారికి సంకేతం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు భయపడకుండా పరిస్థితిని బట్టి మాస్క్, పరిశుభ్రత, గాలి ప్రసరణ వంటి జాగ్రత్తలను పాటించాలని సూచిస్తున్నారు.

## అమరావతి అసెంబ్లీకి సరికొత్త డిజైన్: మంత్రి మనోహర్




**అమరావతి, ఆగస్టు 26 రాజధాని వాయిస్: :** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాల న్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగంగా అసెంబ్లీ భవనాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నా మని చెప్పారు. అసెంబ్లీ భవనం పైభాగంలో టవర్ ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి మొత్తం రాజధాని ప్రాంతా న్ని వీక్షించేలా నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్న ట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ భవన డిజైన్లపై చర్చించినట్లు - మిగతా 2లో..

**రాజమహేంద్రవరం, ఆగస్టు 26 :** తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదిలో వరద ఉద్ధృతి పెరిగింది. భారీగా చేరుతున్న వరద నీటితో పోలవరం ప్రాజెక్టు వద్ద ప్రవాహం తీవ్రతరమవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. - మిగతా 2లో..



## ప్రతి చేనేత కార్మికుడికీ 'నేతన్నల సేవలో పథకం': మంత్రి సవిత



**రాజధాని వాయిస్ శ్రీసత్యసాయి జిల్లా, ఆగస్టు 26:** మగ్గం నేసే ప్రతి నేతన్నకూ 'నేతన్నల సేవలో' పథకం అందజేస్తామని మంత్రి సవిత స్పష్టం చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మొదటి విడతలో 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. రెండో విడతగా త్వరలోనే అర్హులకు ఆర్థికసాయం అందిస్తామన్నారు. కొత్తగా 36,617 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకూ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తిస్తామని..ఆ వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేతన్నల సేవలో నిధులను జమ చేయనున్నట్లు తెలిపారు. అర్హులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. చేనేతల వెంటే కూటమి ప్రభుత్వం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. 365 రోజులూ నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని చెప్పారు. నేతన్నల సేవలో పథకంపై గొడ్డలి పార్టీ అపోహలు సృష్టిస్తోందని మండిపడ్డారు. వైసీపీ ట్రాప్‌లో నేతన్నలు పడొద్దని మంత్రి సవిత కోరారు.

## పిఠాపురం ఆధ్యాత్మిక వైభవానికి రూ.30.66 కోట్లు

- దేవాలయాలు, భజన మందిరాల అభివృద్ధికి భారీ నిధులు
- ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పనులకు వేగం
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు
- ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం


**రాజధాని వాయిస్ పిఠాపురం, ఆగస్టు 26 :** పిఠాపురం నియోజక వర్గంలోని ఆధ్యాత్మిక, చారిత్రక క్షేత్రాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆలయాల పునరుద్ధరణ, భజన మందిరాల నిర్మాణం, కళ్యాణ మండపాల అభివృద్ధి ద్వారా నియోజకవర్గ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొం దించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గం లోని 24 ప్రముఖ దేవాల యాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం రూ.17.06 కోట్లను కేటాయించారు. గొల్లప్రోలు సీతారామ స్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరుకోగా, కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల నివాస గృహాల నిర్మాణం కొనసాగుతుండగా, కుంతీమాధవస్వామి ఆలయం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కుక్కుటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు, - మిగతా 2లో..

## జనవరి 1 నుంచి సంజీవని అమలు

- రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు సీఎం ఆదేశాలు
- డిజిటల్ ఆరోగ్య రికార్డులతో సేవల మెరుగుదల
- 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- వైద్య రంగంలో ఆదర్శంగా నిలవాలన్న లక్ష్యం



**రాజధాని వాయిస్ అమరావతి :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను వచ్చే ఏడాది జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ ఆరోగ్య రికార్డుల ఆధారంగా అమలయ్యే ఈ ప్రాజెక్టు వైద్య సేవల్లో - మిగతా 2లో..



## ప్రగతి సమావేశంలో కీలక ప్రాజెక్టుల సమీక్ష

**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 26 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 53వ ప్రగతి సమావేశానికి అధ్యక్షత వహించి దేశంలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. రైల్వే, రహదారులు, విద్యుత్ రంగాలకు సంబంధించిన ఆరు ప్రధాన ప్రాజెక్టుల అమలుపై అధికారులతో సమగ్రంగా చర్చిం చారు. ఈ ప్రాజెక్టులు తొమ్మిది రాష్ట్రాల్లో విస్తరించి ఉండగా, వాటి మొత్తం పెట్టుబడి విలువ రూ.30 వేల కోట్లకు మించి ఉందని అధికారులు వెల్లడించారు. మౌలిక వసతుల ప్రాజెక్టులను విడివిడిగా కాకుండా సమగ్ర దృష్టితో చూడాలని ప్రధాని సూచించారు. ఒక ప్రాజెక్టులోని ప్రతి భాగం పరస్పరం అనుసంధానమై ఉంటుందని, అందువల్ల మొత్తం ప్రాజెక్టు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని అమలు జరగాలని పేర్కొన్నారు. పనుల వేగం, నాణ్యత, సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ప్రాజెక్టుల అమలులో ప్రతి దశలో సంస్కరణలు కొనసాగాలని, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వా లు చురుకైన పని విధానాన్ని అవలంబించాలని ప్రధాని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి పరిష్కరించే విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధి ంచిన అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమీక్షించిన సందర్భంగా వ్యవసాయ సమాచారాన్ని మరింత సమర్థంగా వినియోగించేందుకు కృత్రిమ మేధస్సు సహా అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించాలని ప్రధాని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు, సమాచార ఆధారిత నిర్ణయాలు అందించేందుకు సాంకేతికత కీలకమని పేర్కొన్నారు. సైబర్ మోసాలు, 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాల అంశంపై కూడా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపు, సైబర్ భద్రతపై విద్య, అధికారులకు శిక్షణ, సంబంధిత సంస్థల మధ్య సమన్వయం ద్వారా ఇటువంటి మోసాలను అరికట్టాలని సూచించారు.

## ఎల్ నినోపై జగన్‌ది అవగాహన లేని విమర్శలు: కొల్లు రవీంద్ర




**అమరావతి, ఆగస్టు 26 రాజధాని వాయిస్:** గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఎల్ నినోపై అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే ఇంట్లో పడుకున్న జగన్.. ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి అభూతకల్పనలు మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన దుర్మార్గాలు అసెంబ్లీ వేదికగా బయటపడతాయనే భయంతోనే సభకు రావడం లేదని ఆరోపించారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను మెప్పించేందుకు రాష్ట్ర ప్రయోజనాలను జగన్ పణంగా పెట్టారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. జగన్ దోపిడీ, ధనదాహం కారణంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు విధ్వంసానికి గురయ్యాయని ఆరోపించారు. పట్టిసీమ పంపులను కాటాకు వేయాలని గతంలో జగన్ వ్యాఖ్యానించలేదా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల్లో అదే పట్టిసీమ ప్రాజెక్టు రాష్ట్రాన్ని ఆదుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో జలాశయాల్లో నీటిని నిల్వ చేయడం వల్ల క్లిష్ట పరిస్థితులను సైతం సమర్థంగా ఎదుర్కొంటున్నామని మంత్రి చెప్పారు. జలవనరులపై జగన్‌కు అవగాహన లేదని విమర్శించారు. రాయలసీమకు ద్రోహం చేసిన జగన్ ఇప్పుడు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థంతో రాయలసీమలో 102 టెండర్లను జగన్ రద్దు చేశారని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాజ్య ప్రయోజనాలను దెబ్బతీసిన గత ప్రభుత్వ నిర్ణయాలపై బాధ్యులు ఎవరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

## జగన్ పాలన చరిత్రను ప్రజలు మరిచిపోలేదు: సత్యకుమార్

**అమరావతి, ఆగస్టు 26 రాజధాని వాయిస్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ వెన్నుపోటు రాజకీయాలకు ప్రతిరూపమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. అలాంటి జగన్.. వెన్నుపోటుపై వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఇతరులకు నీతులు చెప్పే ముందు రాజకీయ చరిత్ర చూసుకోవాలంటూ జగన్‌కు చురకలంటించారు. జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ వ్యవహారంలో వైఎస్ జగన్ వైఖరిపై మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ వైసీపీ అధినేతపై మంత్రి సత్యకుమార్ నిప్పులు చెరిగారు. రిజర్వేషన్లు ప్రకటించడం కాదు.. చట్టబద్ధంగా నిలబెట్టడమే ముఖ్యమని అభిప్రాయపడ్డారు. జగన్ హయాంలో బీసీ రిజర్వేషన్లు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు చట్టబద్ధమైన సామాజిక న్యాయం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసింది జగన్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బీసీలను పాలనలో భాగస్వాములుగా చేస్తుంది కూటమి ప్రభుత్వమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమిపై జగన్‌లో ఇప్పుడే ఆందోళన మొదలైందంటూ ఎద్దేవా చేశారు. ఓటమికి కారణాలు వెతికే పనిలో జగన్ ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. కూటమి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రజల మద్దతు కూటమి ప్రభుత్వానికే ఉందని జగన్ ఆందోళనతో మరోసారి తేలిపోయిందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

# జనవరి 1 నుంచి సంజీవని అమలు

గణనీయమైన మార్పులకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. సంజీవని ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే రోగుల ఆరోగ్య వివరాలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటంతో వైద్య సేవలు మరింత వేగవంతం, పారదర్శకంగా మారతాయని ముఖ్యమంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వైద్య రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలని సీఎం సూచించారు. సంజీవని ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని అధికారులకు నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని కోరారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, ధ్రువీకరణ కార్యక్రమాలు, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి పోర్టళ్లతో అనుసంధానం వంటి కీలక అంశాలు ఈ ప్రణాళికలో భాగంగా ఉన్నాయని తెలిపారు.

ప్రాజెక్టు విజయవంతమైన అమలుకు అవసరమైన మానవ వనరుల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థపై అవగాహన పెంచి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. సంజీవని ప్రాజెక్టు రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక సంస్కరణగా నిలిచి ప్రజలకు నాణ్యమైన, సులభమైన వైద్య సేవలను అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

# పిఠాపురం ఆధ్యాత్మిక వైభవానికి రూ.30.66 కోట్లు



శ్రీపాద శ్రీవల్లభ దేవస్థానా నికి రూ.2 కోట్లు కేటాయించి ప్రత్యేక పనులు చేపట్టనున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాల పరిరక్షణతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధా న్యం ఇస్తున్నారు. పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయం సహా పలు పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా కొత్త రూపును సంతరించుకోనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటంతో, వారికి మరిం త మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పండుగలు, బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో భారీగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు విస్తరిస్తున్నారు.ఉప ముఖ్యమ ంత్రి ప్రత్యేక చొరవతో యు.కొత్తపల్లి మండలంలోని తిరుమ ల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండ పాన్ని నిర్మించనున్నారు. గతంలో పిఠాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని కూడా ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మించిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేసేందుకు తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ భజన మందిరాలు భక్తి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక సమావేశాలు, సాంస్కృతిక వేడుకలకు వేదికలుగా ఉపయోగపడనున్నాయి. మొత్తం రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు తెలిపారు.

## వివాహ వార్షికోత్సవం జరుపుకున్న నారా లోకేశ్ దంపతులు

**– 19 ఏళ్ల దాంపత్య బంధానికి మధుర జ్ఞాపకాలు**
**– సోషల్ మీడియాలో ప్రేమ సందేశాల వెల్లువ**
**– బ్రహ్మణికి శుభాకాంక్షలు తెలిపిన లోకేశ**
**– అభిమానులు, టీడీపీ శ్రేణుల నుంచి అభినందనలు**



**రాజధాని వాయిస్:అమరావతి, ఆగస్టు 26 :** ఆంధ్రప్రదేశ్ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రహ్మణి మంగళవారం తమ 19వ వివాహ వార్షికోత్స వాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ సామాజిక మాధ్యమాల వేదికగా ఒకరిపై ఒకరు ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తూ ప్రత్యేక సందేశాలు పంచుకున్నారు. ఈ పోస్టులు ప్రస్తుతం విస్తృతంగా చర్చనీయాంశంగా మారా యి. వివాహ వార్షికోత్సవం సందర్భంగా నారా లోకేశ్ తన సతీమణి బ్రహ్మణికి శుభాకాంక్షలు తెలియజేస్తూ భావోద్వేగ సందేశం విడుదల చేశారు. గత 19 ఏళ్లుగా జీవితంలోని ప్రతి కష్టసుఖాల్లో, విజయాలు--పరాజయాల్లో బ్రహ్మణి తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె తన జీవితంలో ఓర్పు, బలం, బేషరతైన ప్రేమకు ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.మరోవైపు నారా బ్రహ్మణి కూడా తమ దాంపత్య జీవితంపై ఆనందం వ్యక్తం చేశారు. కలిసి 20వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో తాము నిర్మించుకున్న కుటుంబ బంధం, పంచుకున్న అనుభవాలు, జ్ఞాపకాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని మధుర క్షణాలను కలిసి ఆస్వాదించాలని ఆకాంక్షించారు. నారా లోకేశ్, బ్రహ్మణి వివాహం 2007 ఆగస్టు 26న జరిగింది. ఈ దంపతులకు దేవాన్ష్ అనే కుమారుడు ఉన్నారు. రాజకీయ, సామాజిక కార్యక్రమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వడం లోకేశ్ ప్రత్యేకతగా భావిస్తారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. దాంపత్య జీవితంలో మరిన్ని సంతోషకరమైన సంవత్సరాలు రావాలని ఆకాంక్షిస్తూ అభినందన సందేశాలు పంపారు. రాజకీయ జీవితంలోనూ, కుటుంబ జీవితంలోనూ పరస్పర సహకారం, అవగాహనతో ముందుకు సాగుతున్న నారా లోకేశ్--బ్రహ్మణి దంపతులు అనేక మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. వారి 19వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది.

## విలేకరి పేరుతో బెదిరింపులు.. వ్యక్తి అరెస్ట్

శ్రీకాకుళం, ఆగస్టు 26 **రాజధాని వాయిస్** : తాను విలేకరినని చెప్పుకుంటూ ప్రజలను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడడం, డబ్బులు వసూలు చేస్తున్నాడనే ఆరోపణలపై కోరాడ శ్రీనివాసరావును శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, అదనపు జెఎంఎఫ్‌సీ న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడిపు నాయుడు తెలిపారు. నిందితుడు తనను ఒక వార్తా సంస్థకు చెందిన విలేకరిగా పరిచయం చేసుకుంటూ పలువురిని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హాస్టల్ నిర్వాహకులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో తనను ఎవరూ ప్రశ్నించలేరని, రాజకీయ నాయకులు, అధికారులు కూడా తనపై చర్యలు తీసుకోలేరని చెప్పి ప్రజలను భయాందోళనలకు గురిచేసినట్లు విచారణలో బయటపడింది.నిందితుడిపై గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. 2009లో ఓ హోటల్ యజమానిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో కేసు నమోదైందని తెలిపారు. అలాగే పెదపాడులోని సామాజిక సంక్షేమ పాఠశాల వార్డెన్, సిబ్బందిని బెదిరించడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఆరోపణలతో మరో కేసు కూడా నమోదైందన్నారు. ప్రస్తుత కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకునే సమయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసు విధులకు ఆటంకం కలిగించడం, దురుసుగా ప్రవర్తించడం వంటి అభియోగాలతో ప్రత్యేక కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# కొండెక్కిన చక్కెర ధరలు..

ఊహాగానాలు కూడా ధరల పెరుగుదలకు కారణమని తెలిపింది.ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి తొలుత అంచనా వేసిన 343 లక్షల టన్నులతో పోలిస్తే 306 లక్షల టన్నులకు పరిమితం కావచ్చని ప్రభుత్వం వెల్లడించింది. అయినప్పటికీ దేశీయ వినియోగానికి అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. భారత్‌లో సాధారణంగా ఏటా 300–340 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి కాగా, దేశీయ వినియోగం 280–290 లక్షల టన్నులుగా ఉంటుందని తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర సరఫరా ఒత్తిడిలో ఉందని ప్రభుత్వం పేర్కొంది. 2026–27లో ప్రపంచ చక్కెర లోటు సుమారు 33 లక్షల టన్నులుగా ఉండొచ్చని అంచనా వేసింది. జూన్ 30న టన్నుకు 474 డాలర్లుగా ఉన్న అంతర్జాతీయ చక్కెర ధర ఆగస్టు 20 నాటికి 552 డాలర్లకు పెరిగిందని తెలిపింది. ఇథనాల్ కార్యక్రమం చెరకు రైతులకు, చక్కెర మిల్లులకు ప్రయోజనం చేకూర్చిందని కేంద్రం పేర్కొంది. మిగులు చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడం ద్వారా చక్కెర మిల్లుల వద్ద నిధులు నిలిచిపోకుండా, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడగలిగామని వివరించింది. చెరకు సాగు విస్తీర్ణం 2015–16లో 49.27 లక్షల హెక్టార్ల నుంచి 2025–26లో 58.87 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపింది. 2025–26 చక్కెర సీజన్‌కు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిల్లో ఇప్పటికే 97 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని ప్రభుత్వం వెల్లడించింది. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో అవి ప్రభుత్వ సాయంపై ఆధారపడటం కూడా తగ్గిందని పేర్కొంది.

## అమరావతి అసెంబ్లీకి సరికొత్త డిజైన్: మంత్రి మనోహర్

మంత్రి తెలిపారు. 265 అసెంబ్లీ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా భవన నిర్మాణ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

**సందర్శకులకు ప్రత్యేక అనుభూతి**

అసెంబ్లీని సందర్శించే ప్రజలకు మంచి అనుభూతి కలిగేలా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో అసెంబ్లీ, శాసనమండలి సభ్యులు ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయడానికి అనువుగా డిజైన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణం చుట్టూ పచ్చదనం ఉండేలా, ఒక గార్డెన్‌లా కనిపించే విధంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు మంత్రి తెలిపారు. మంత్రులు, విప్‌లు, కమిటీ చైర్మన్లు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అసెంబ్లీ డిజైన్‌ను రూపొందిస్తున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు.

# గోదావరిలో ఉద్ధృత వరద.. పోలవరం అప్రమత్తం

పోలవరం ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్‌వే వద్ద 30.20 మీటర్లుగా నమోదైంది. వరద ప్రవాహాన్ని నియంత్రించేందుకు స్పిల్‌వేకు చెందిన 48 గేట్లను ఎత్తి దిగువకు సుమారు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.వరద ప్రభావం దేవీపట్నం మండలంలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గండిపోశమ్మ ఆలయానికి భక్తుల రాకకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు.గోదావరి నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ఇంకా భారీగా వరద నీరు వస్తుండటంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రలకు సంబంధించిన బోటు సర్వీసులను నిలిపివేసే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే వరకు పర్యాటక కార్యక్రమాలపై పరిమితులు కొనసాగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## సోమిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసిన కాకాణి

**- ప్రమాణానికి రాకపోవడమే అవినీతికి నిదర్శనం**
**- సర్వేపల్లిలో మాఫియాలు రాజ్యమేలుతున్నాయని విమర్శ**
**- ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్**



**నెల్లూరు, ఆగస్టు 26 రాజధాని వాయిస్ :** ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పొదలకూరు, వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామాల్లో ఘన స్వాగతం లభించ గా, మహిళలు రాఖీలు కట్టి అభినందనలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కాకాణి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తనపై చేసిన ఆరోపణల విషయంలో ఆంజనేయస్వామి సాక్షిగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరినా సోమిరెడ్డి వెనక్కి తగ్గారని, అదే ఆయన అవినీతి రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. కాకాణి మాట్లాడుతూ పొదలకూరు మండలంలో అక్రమ లేఅవుట్ల వ్యవహారంపై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకునే ధైర్యం సోమిరెడ్డికి లేదన్నారు. అక్రమ లేఅవుట్ల యజమానులను బెదిరించి కోట్ల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. అక్రమాలు నిజమే అయితే ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సర్వేపల్లి నియోజకవర్గంలో ఇసుక, మట్టి, గ్రావెల్, బూడిద మాఫియాలు విస్తరిస్తున్నాయని కాకాణి ఆరోపించారు. ఈ వ్యవహారాల వెనుక సోమిరెడ్డి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అధికారాన్ని ఉపయోగించి అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముత్తుకూరు మండలంలో బూడిద బల్కర్ల అంశాన్ని ప్రస్తావించిన కాకాణి, కమిషన్ల కోసం నిరసన కార్యక్రమాలను కూడా రాజకీయంగా వినియోగించుకున్నారని ఆరోపించారు. బల్కర్ల యజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజల సమస్యలను పక్కన పెట్టారని విమర్శించారు. కాలుష్య సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే శాశ్వత పరిష్కారం చూపాల్సిందిపోయి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించారని అన్నారు.గిరిజనుల సంక్షేమం పేరుతో మాట్లాడుతున్న సోమిరెడ్డి, వాస్తవానికి గిరిజన భూముల నుంచే అక్రమంగా మట్టి తరలింపులు జరిపిస్తున్నారని కాకాణి ఆరోపించారు. గిరిజన కుటుంబాలకు న్యాయం చేయకుండా వారిని మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ అంశంలో కూడా ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని కాకాణి ఆరోపించారు. పామాయిల్ కంపెనీలకు భూముల కేటాయింపులపై తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. నేలటూరు గ్రామ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించి, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కాకాణి కోరారు.

## అమెరికాలో మోహన్ భగవత్ పర్యటనను నిలిపివేయడం సరికాదని చెప్పాను: కేఏ పాల్



ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ అమెరికా పర్యట న ప్రస్తుతం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అమెరికా, కెనడా, బ్రిటన్‌లలో 17 రోజుల పాటు జరగనున్న గ్లోబల్ అవుట్‌రీచ్ పర్యటనలో భాగంగా ఆయన న్యూయార్క్‌కు చేరుకోవడంతో ఈ అంశం దౌత్య, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఈ పరిణామంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మోహన్ భగవత్ అమెరికా రాకముందే ఆయన వీసాను రద్దు చేయాలంటూ అక్కడి క్రైస్తవ, ముస్లిం, సిక్కు వర్గాల సంస్థలు అమెరికా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయని కేఏ పాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో వీసా రద్దు చేసే అధికారం ఉన్న అమెరికా ప్రతినిధి ఒకరు తన అభిప్రాయాన్ని కోరినట్లు వెల్లడించారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో మోహన్ భగవత్ పర్యటనను నిలిపివేయడం సరికాదని, ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన భావప్రకటనా స్వేచ్ఛ ఉండాలని తాను అమెరికా నాయకులకు స్పష్టం చేసినట్లు చెప్పారు.మరొకవైపు, ఆగస్టు 29న న్యూయార్క్‌లోని ప్రసిద్ధ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్' పేరిట జరగనున్న బృహత్ సభలో మోహన్ భగవత్ ప్రసంగించనున్నారు. అయితే ఈ పర్యటనపై అమెరికాలోని హక్కుల సంఘాల నుంచి నిరసనలు, మద్దతు రెండూ వ్యక్తమవుతుండటంతో ఆయన పర్యటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సభ ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, సోదరభావాన్ని కాపాడుతామని భగవత్ స్పష్టమైన సందేశం ఇవ్వాలని కేఏ పాల్ కోరారు.

## అమరావతి అసెంబ్లీ నిర్మాణంపై సమీక్ష

**- అంతర్జాతీయ ప్రమాణాలతో భవన నిర్మాణం**
**- డిజిటల్ సాంకేతిక వసతులపై చర్చ**
**- నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశం**



**అమరావతి, ఆగస్టు 26: రాజధాని వాయిస్** రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నూతన శాసనసభ భవన పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాసనసభ భవన నిర్మాణం, అంతర్గత రూపకల్పన, ఆధునిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చిం చారు. సమీక్షలో భాగంగా అసెంబ్లీ భవన ఇంటీరియర్ డిజైన్లపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. శాసనసభ్యుల సీటింగ్ ఏర్పాట్లు, సభా నిర్వహణకు అనుకూలమైన ఆధునిక వసతుల కల్పన, భవన అంతర్గత సౌందర్యాన్ని ప్రతిబింబించే విధంగా రూపకల్పన చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా నిలిచేలా భవనాన్ని అభివృద్ధి చేయాలని అధికారు లకు ఆదేశించారు.అలాగే అత్యాధునిక డిజిటల్, సాంకేతిక వసతుల ఏర్పాటుపై సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సభా కార్యకలాపాల నిర్వహణ, సమాచార సాంకేతిక వ్యవస్థలు, డిజిటల్ కనెక్టివిటీ, భద్రతా ప్రమాణాల కు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగి ంచాలనే అంశంపై చర్చించారు. అమరావతి రాజధాని ప్రతిష్టను మరింత పెంచేలా శాసనసభ భవనం నిర్మాణం ఉండాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిపారు. దేశంలోని ప్రముఖ శాసనసభ భవనాలతో సరితూగే విధంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగు ణంగా నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు.నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులు సమావేశంలో వివరించారు. వివిధ విభాగాల పనుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక ఏర్పాట్లపై నివేదిక సమర్పించారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో నూతన శాసనసభ భవనం కీలక మైలురాయిగా నిలవనుందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణ ంగా, ఆధునిక సదుపాయాలతో కూడిన శాసనసభ భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

**రాజమహేంద్రవరం, ఆగస్టు 26 రాజధాని వాయిస్ :** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీలో ముగ్గురు మావోయిస్టులు లొంగిపో యారు. చింతూరు పోలీస్ స్టేషన్‌లో రంపచోడవరం ఓఎస్డీ పంకజ్‌కు మార్ మీనా ఎదుట వారు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ క్రమంగా బలహీనపడుతోందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో జరుగుతు న్న అభివృద్ధిని చూసి మావోయిస్టులు జనజీవన ప్రవంతిలోకి వస్తున్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా పర్సనల్ గార్డ్‌గా పనిచేసిన ముచ్చకి మంగి, కడితి లక్ష్మయ్య, కడితి వెంకి ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల కార్యకలాపాల్లో వీరి పాత్ర ఉందన్నారు. లొంగిపోయిన మావోయి స్టులకు ప్రభుత్వం తరపున సాయంతోపాటు పునరావాసం, సంక్షేమ పథకాలు, అన్ని సదుపా యాలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

# పారిశ్రామిక సేవా సంఘానికి నూతన పాలకమండలి

- ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు
- నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి
- పారిశ్రామిక అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమన్న సూచన
- పరిశ్రమల పురోగతికి సహకారం అందిస్తామన్న హామీ





**రాజధాని వాయిస్ విజయవాడ :** విజయవాడ ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ అసోసియేషన్ హాల్‌లో ది విజయవాడ నోటిఫైడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలక మండలి సభ్యులకు మంత్రి కొలుసు పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి, పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో నూతన పాలకమండలి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పరిశ్రమల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక పురోగతికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సేవా సంఘాలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. పరిశ్రమల వృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వం కూడా పరిశ్రమల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పరిశ్రమల విస్తరణతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. నూతన పాలకమండలి పరిశ్రమల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆటోనగర్‌తో పాటు విజయవాడ పరిసర పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కార్యక్రమంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సేవల విస్తరణ ద్వారా పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, సేవా సంఘ ప్రతినిధులు, నూతన పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నూతన పాలకమండలి బాధ్యతలు స్వీకరించడంతో పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.

# మన ఊరు - మన జెండా కార్యక్రమం





**రాజధాని వాయిస్ రాజమండ్రి, ఆగస్టు 26 :** "మన ఊరు - మన జెండా" కార్యక్రమంలో భాగంగా రాజమండ్రి 9వ మండలంలోని క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆమె పాల్గొన్నారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి, దేశ సమైక్యతకు ప్రతీక అని నాయకులు పేర్కొన్నారు. దేశభక్తి భావనను ప్రతి ఒక్కరిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ పతాకం దేశ చరిత్ర, త్యాగాలు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తికి గుర్తుగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువతలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. "మన ఊరు - మన జెండా" కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో జాతీయ పతాకం పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యతను ప్రజలకు గుర్తు చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ జాతీయ పండుగలు, దేశభక్తి కార్యక్రమా ల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ గీతాలాపన, దేశభక్తి నినాదాల మధ్య కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. పాల్గొన్న వారందరూ జాతీయ పతాకానికి వందనం చేసి దేశాభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు. జాతీయ జెండా దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న నాయకులు, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసేలా ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమం దేశభక్తి వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే

- నంది సేవ కార్యక్రమానికి ఉభయదాతగా హాజరు
- పూర్ణకుంభంతో ఘన స్వాగతం
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బొజ్జల సుధీర్ రెడ్డి
- భక్తుల మధ్య ఆధ్యాత్మిక వేడుకలు





**రాజధాని వాయిస్ శ్రీకాళహస్తి, ఆగస్టు 26 :** శ్రీకాళహస్తీశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన ఊరందరు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు ధార్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా రాత్రి నిర్వహించనున్న పవిత్ర నంది సేవ కార్యక్రమానికి ఉభయదాతగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలోని మూలవిరాట్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేసి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించినట్లు తెలిపారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీస్సులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తిపారవశ్య వాతావరణాన్ని నెలకొల్పాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. నంది సేవ కార్యక్రమం ఆలయ ఉత్సవాల్లో అత్యంత విశిష్టమైనదిగా భావించబడుతుండటంతో భక్తుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, వేద పండితులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

# వినాయక ఉత్సవాల సన్నాహకాలపై మంత్రి సమీక్ష

- ఉత్సవ సమితి సభ్యులతో చర్చలు
- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ
- ప్రశాంత వాతావరణంలో వేడుకల నిర్వహణకు చర్యలు



**రాజధాని వాయిస్ నెల్లూరు, ఆగస్టు 26:** నెల్లూరులో సెప్టెంబర్ 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి అనం రామనారాయణ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తన నివాసంలో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశమైన ఆయన, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. సమావేశం లో ఉత్సవ సమితి ప్రతినిధులు వేడుకల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అందించనున్న ప్రత్యేక సేవల గురించి మంత్రికి వివరించారు. ముఖ్యంగా ప్రముఖ దేవస్థానాల నుంచి ప్రసాదాలను తెప్పించి భక్తులకు పంపిణీ చేయాలనే ప్రతిపాదనను మంత్రి అభినందించారు. భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని మరింత పెంపొందించే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తు ందని తెలిపారు. సెప్టెంబర్ 18న జరగనున్న గణేష్ నిమజ్జనో త్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ నుంచి పూర్తి సహకారం అందించాలని ఉత్సవ సమితి సభ్యులు మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన అనం రామనారాయణ రెడ్డి, ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన అన్ని శాఖలతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వెలుగులు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మంత్రి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉత్సవా లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రశాంత వాతావ రణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బీజేపీ నాయకుడు సురేంద్ర రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధు లు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, ప్రతిపాదనలను చర్చించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

- చాట్రాయిలో కుటుంబ వేడుకలో పాల్గొన్న కొలుసు పార్థసారథి
- కేక్ కట్ చేయించి ఆశీస్సులు అందజేత
- టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం
- చిన్నారి ఉజ్వల భవిష్యత్తు కోరిన మంత్రి



**రాజధాని వాయిస్ చాట్రాయి, ఆగస్టు 26 :** చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య, తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ మనవడి జన్మదిన వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరైన మంత్రి చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారితో కలిసి కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను ఆనంద ంగా నిర్వహించారు. చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఆకాంక్షిం చారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించిన కొలుసు పార్థసారథి, చిన్నారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆశీర్వది ంచారు. కుటుంబంలో ఇలాంటి సంతోషకరమైన సందర్భాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి హాజరైన వారు చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఇంటి శుభకార్యానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారికి శుభాకాంక్షలు తెలుపుతూ సంతోషాన్ని పంచుకున్నారు.

# వినాయక ఉత్సవాలపై పోలీసుల సమీక్ష



**రాజధాని వాయిస్ చిట్వేల్, ఆగస్టు 26 :** రాబోయే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, భక్తుల సౌకర్యాలపై చిట్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వినాయక మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని పోలీసులు కోరారు. వినాయక మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యుత్, అగ్నిమాపక భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారుల వినియోగం, ట్రాఫిక్ నిర్వహణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీసుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కమిటీ సభ్యులకు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఉత్సవ నిర్వాహకులు కీలక పాత్ర పోషించాలని అధికారులు పేర్కొన్నారు. మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. యువత, స్వచ్ఛంద సేవకులు పోలీసులకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని నిర్ణయించారు.

# బాపట్లలో "శిరోరక్ష--ప్రాణరక్ష" అవగాహన కార్యక్రమం





**రాజధాని వాయిస్ బాపట్ల, ఆగస్టు 26 :** ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం బాపట్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "శిరోరక్ష--ప్రాణరక్ష" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వాహన తనిఖీలు చేపట్టి హెల్మెట్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలను వివరించి, తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో తలకు గాయాలు కాకుండా కాపాడటంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. భద్రతా నియమాల పాటన ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు పోలీసు శాఖ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని అధికారులు వెల్లడించారు. హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు కూడా అత్యంత అవసరమని వివరించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవు తున్నాయని పోలీసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో రహదారి భద్రతపై మరింత అవగాహన కల్పించేందుకు "శిరోరక్ష--ప్రాణరక్ష" కార్యక్రమాన్ని కొనసాగి స్తామని అధికారులు తెలిపారు. ప్రజల సహకారంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కాసు శేషమ్మకు ఘన నివాళి







**పిడుగురాళ్ల.ఆగస్టు 26రాజధాని వాయిస్ :**మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి మాతృమూర్తి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి నాయనమ్మ దివంగత కాసు శేషమ్మ పెద్దకర్మ కార్యక్రమం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడు మిట్టా జంగమయ్య యాదవ్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాసు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, మాచవరం జడ్పీటీసీ జె.శివ యాదవ్, ఎం. రామకృష్ణ తదితరులు పాల్గొని శేషమ్మకు నివాళులు అర్పించారు.

## మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలి




**పిడుగురాళ్ల.ఆగస్టు 26రాజధాని వాయిస్ :**విద్యార్థులు మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని బాధ్యతగల పౌరులుగా ఎదగాలని కెఎన్ఆర్, పిఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు అన్నారు. బుధవారం పిడుగురాళ్ల కెఎన్ఆర్ విద్యాసంస్థలు, కొండమోడు పిఎస్ఆర్ కళాశాలలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యతో పాటు సేవ, మానవతా విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.నరసింహారావు, టి.గోపికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్

**గురజాల డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు**



**కారంపూడి.ఆగస్టు 26రాజదాని వాయిస్ :**శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ లు నిరుస్తున్నామని గురజాల డిఎస్పి ఉమామహేశ్వరరావు అన్నారు. కారంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో బుధవారం ఉదయం 50 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో కారంపూడి సర్కిల్ సీఐ భాస్కరరావు ఎస్సై వాసు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిం చారు.ఎలాంటి పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను, పలు మారునాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, రానున్న పంచాయతీ ఎలక్షన్లో ఇలాంటి వివాదాలు తావు లేకుండా తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని కోరారు. గ్రామాలలో అలజల్లు సృష్టించి అల్లరు లు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకోవద్దంటూ యువతను కోరారు. గ్రామాలలో ఎవరైనా ఆసంగీక కార్యక లాపాలకు పాల్పడితే కారంపూడి పోలీస్ స్టేషన్ కు సమాచారం అందిం చాలని కోరారు.

# ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

### మాచర్లలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, టీచర్ల భారీ నిరసన ర్యాలీ

**మాచర్ల.ఆగస్టు 26 రాజధాని వాయిస్:** పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సెయింట్ జేవియర్ స్కూల్ నుంచి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఇటీవల నల్గొండ జిల్లా లో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య, విశాఖలో విద్యార్థి మృతి వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, విద్యాసంస్థల్లో భద్రతా ప్రమాణాలు పెంచడంతో పాటు ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరుతూ తహశీల్దార్ బి. కిరణ్‌కుమార్‌కు వినతిపత్రంఅందజేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడు తూ, ఉపాధ్యాయుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో దృష్టి సారించాలని ఎంఈఓ కోటేశ్వరరావు, స్కూల్ బస్సుల భద్రతా నిబంధనలు పాటించాలని



ఎంవీఐ శేషిరెడ్డి సూచించారు. మాచర్లలోని 48 ప్రైవేట్ పాఠశాల ల్లో సురక్షిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యతని నిర్వాహ కులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ఎంఏ అధ్యక్షుడు కె.వి. రమణ, డి. జయరాం, కె. శ్రీనివాసరావు, జైస్వాల్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## అమీనాబాద్ తండా యందు గిరిజన తీజ్ సంబరాలు

**గుంటూరు ఆగస్టు 26రాజధాని వాయిస్:** ఫిరంగిపురం మండలం అమీనాబాద్ గ్రామపంచాయతీ తండా యందు గిరిజన తీజ్ సంబరాలు.. గిరిజన తెగలలో ముఖ్యంగా లంబాడా గిరిజనులు సాంస్కృతి సాంప్రదాయాలు నృత్యం వేషధారణ భాష తినే ఆహారం కూడా ఈ సమాజానికి భిన్నంగా ఉంటాయి... ప్రతి సంవత్సరం శ్రావణ మాసాల్లో భారతదేశ వ్యాప్తంగా లంబాడి బంజారా సుగాలులు ఎక్కడ ఉన్న వారి జాతి ఐకమత్యంతో సాంప్రదాయ గౌరవ చిహ్నంతో తొమ్మిది రోజులు జరిగే జాతరలో నవధాన్యాలతో సేంద్రియ ఎరువుతో ఎదురు బొంగుల బట్టల్లో నారును పోసి తొమ్మిది రోజులు వివాహం కానీ కన్య స్త్రీలతో ఉదయం మధ్యాహ్నం సాయంత్రం సాంప్రదాయ దుస్తులతో ఆరాధనతో బోరి బావల దగ్గర నుంచి నీరు స్వీకరించి నవధాన్య నారుబుట్టలో నీరు పోస్తూ దేశము అన్ని రంగాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆస్వాదిస్తూ పాట రూపంలో నృత్యం చేస్తూ ఉంటారు... బంజారాల తీజ్ పండుగ అంటే... పెళ్లి ఈడుకొచ్చిన గిరిజన లంబాడా అమ్మాయిలు తొమ్మిది రోజులు సంబరంగా జరుపుకునే పండుగ తేజు గోధుమ వరి శనగలు నవధాన్యాలు ఒకరోజు ముందు నానబెట్టి నెలపొడుపు చూసి ఎదురు భుట్టల్లో సేంద్రియ ఎరువుల కలిపి ప్రతిరోజు ఉదయము మధ్యాహ్నం సాయంత్రం మీరు పోస్తూ ఉంటారు.. పెళ్లి ఈడుకు వచ్చిన యువతులు తమకు కావాల్సిన వరుడు కోసం చేసే ఈ పండుగ ముందుగా తల్లిదండ్రులు పెద్దల ఆశీస్సులు తీసుకుంటారు యువతులందరూ ఇంటింటికి వెళ్లి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం.. తండా అంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా పెద్దల ఆశీర్వాదంతో ఈ తీజ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు... నియమ నిష్టలతో.. తండా లోని



యువతలందరూ కలిసి తమ బుట్టలో ఒకే చోట పెడతారు తొమ్మిది రోజులు పెట్టిన బుట్టలకు నీళ్లు పోస్తూ వాటి చుట్టూ తిరుగుతూ గిరిజన నృత్యాలు పాటలు పాడుతూ గడుపు తారు.. ఏడవ.. ధమోలీగా చూర్మోను మిరమయాడికి భవానికి నివేదిస్తారు వెండి విగ్రహాలు రూపాయి బిళ్ళలు అమ్మవారి ముందు పెట్టి మేకపోతును భలిగా ఇస్తారు.. లంబాడ గిరిజనులకు తల్లిదండ్రి ప్రకృతి కొరత లేకుండా ధాన్యాన్ని.. పస్తువులు ఉంచకుండా పంటల్ని పుష్కలంగా ఇవ్వడమే కాదు తనకు అనువైన తోడును కూడా ప్రకృతి మాతే తీసుకో వస్తుందని ప్రగాఢమైన నమ్మకం... సంస్కృతి సాంప్రదాయాల కళలకు నెలమయమైన లంబాడా బంజారా తీజ్ పండుగలను ప్రభుత్వం అధికారం గా గుర్తించి సెలవు దినముగా ప్రకటిస్తూ తెలుగు పాఠ్యపుస్తకాల్లో కూడా చరిత్రను సమాజానికి అందించవలసిన అవసరం ఉన్నదని లంబాడా హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు దేవసోత్.చంద్ర నాయక్ గారు తెలియజేశారు తండాలో శ్రీపురుషులు భేదం లేకుండా అందరూ కలిసి తొమ్మిది రోజులు నవజాత్రాలుగా సంతోషాలతో కుటుంబ సమేతం పాల్గొని జరుపుకునే తీజ్ పండుగ సందేశము

## వినియోగదారులు గుడ్డ సంచులు గాని, జూట్ బ్యాగులు వాడాలి కమిషనర్

**గురజాల, ఆగస్టు 26రాజధాని వాయిస్:**గురజాల పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై సూర్య న్యూస్ కు మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ వై వి ఎల్ శివ నారాయణ రావు తెలియపరిచారు. గురజాల పట్టణ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ పట్టణ సాధనలో భాగంగా ఒకసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్ (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ నిర్వహిస్తున్నారు . పట్టణంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, కూరగాయల మార్కెట్, కిరాణా దుకాణాలు, హోటళ్లు ఇతర వ్యాపార సముదాయాలకు గతంలో చెప్పి ఉన్నానని మరల వీటిపై శ్రద్ధ తీసుకొని సెప్టెంబర్ 5 కల్లా ప్రతి దుకాణంలో ఉన్న కవర్లను మొత్తాన్ని సీలు చేస్తామని ఆయన అన్నారు. ఒకసారి ఆ దుకాణాలనుసందర్శించి దుకాణదారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని అన్నారు. నిషేధిత వస్తువులు: 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్ట్రాలు, థర్మోకోల్ వస్తువులు ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని తక్షణమే నిలిపివేయాలి.ప్రత్యామ్నాయాల ప్రోత్సాహం: ప్లాస్టిక్‌కు బదులుగా బట్ట సంచులు (క్లాత్ బ్యాగులు), జనపనార (జూట్) బ్యాగులు, పేపర్ బ్యాగులు అరటి ఆకులు/ఇస్తరాకులు వాడాలని సూచించారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులు సొంత సంచులు తెచ్చుకునేలా ప్రోత్సహించాలి ఉన్నారు.పర్యావరణ హితం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల డ్రైనేజీలు పూడికపోయి దోమలు వృద్ధి చెందడం, పశువుల ఆరోగ్యం క్షీణించడం నేల సారం తగ్గడం వంటి తీవ్ర నష్టాలు జరుగుతున్నాయని వివరించారు.జరిమానాలు చట్టపరమైన



చర్యలు: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిషేధిత ప్లాస్టిక్ వాడినా, విక్రయించినా భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాల లైసెన్సులు రద్దుచేస్తామనిహెచ్చరించారు. పట్టణాన్ని "ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ పట్టణం"గా తీర్చిదిద్దేందుకు వ్యాపార వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరూ నగర పంచాయతీకి పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీకి ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన షేక్ సలీం..

**మంగళగిరి ఆగస్టు 26రాజధాని వాయిస్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీల నియామక పత్రాలను బుధవారం కాంగ్రెస్ పార్టీ సభ్యులకు అందజేశారు. నూతనంగా గుంటూరు జిల్లా కాపు సాధికారిక చైర్మన్‌గా, ఐఎన్‌టీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షులు రేమిడి శెట్టి హనుమంతరావు, జిల్లా కార్యదర్శిగా బుల్లా సమర్పణ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా మహిళా అధ్యక్షురాలి గా షేక్ మున్ని, తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా దర్శనపు శామ్యూల్,మంగళగిరి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుజర్లపూడి జాన్‌బాబు, మంగళగిరి మండల అధ్యక్షులుగా కొప్పాల కృష్ణారావు చౌదరి, దుగ్గిరాల మండలఅధ్యక్షురాలిగా నెమలికంటి ఆదెమ్మ, తాడేపల్లి మండల అధ్యక్షులుగా పఠాన్ సుభాని,గుంటూరు జిల్లా కార్యదర్శిగా నరేష్,గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీగా అమర సుధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కమిటీల ఏర్పాటు, జాబితా విడుదల కు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైఎస్ షర్మిలా రెడ్డికి షేక్ సలీం ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, జిల్లా మాజీ



ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, గుంటూరు జిల్లా డీసీసీ అధ్యక్షుడు యనం సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మల్లికార్జున కర్గే, సోనియా గాంధి, రాహుల్ గాంధి, ప్రియాంక గాంధీ, రాష్ట్ర అధ్యక్షు రాలు షర్మిలారెడ్డి నాయకత్వాన్ని బలంగా ప్రజలలోకి తీసుకె ళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత చైర్మన్ రామనాథం పూర్ణచంద్రరావు,ఆంధ్రప్రదేశ్ మహిళా సెక్రటరీ, విజయవాడ సిటీ ఇన్చార్జ్, ఆర్గనైజేషన్ గంధం రాధిక పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల జీతాలు ఇస్తాం

**ప్రత్యామ్నాయంగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేస్తాం జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి దృష్టికి తీసుకు వెళ్తున్నాం ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి**



**కారంపూడి.ఆగస్టు 26రాజదాని వాయిస్ :** మండల కేంద్రమైన కారంపూడిలో పారిశుద్ధ కార్మికులకు మూడు నెలల జీతాలు అడ్వాన్స్ గా ఇస్తున్నామని అంటున్నామని ఎంపీడీవో గంట శ్రీనివాస్ రెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రతి నెల కూడా కార్మికులను దృష్టిలో పెట్టుకొని జీతాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.కార్మికులు గత ఐదు రోజుల నుండి సమ్మెలోఉన్నారు.కార్మికులు అడ్వాన్స్ జీతాలు ఇస్తామన్న విధులకు రాకపోతే ప్రత్యామ్నాయంగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి,డివిజనల్ డెవలప్మెంట్ అధికారి దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఆయన తెలిపారు. పరిస్థితి కార్మికులు ప్రత్యామ్నాయ సిబ్బందిపై ఎలాంటి వివాదాలు పెట్టుకోకుండా ఉండేందుకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పిడుగురాళ్లలో 31న మెగా జాబ్ మేళా




**పిడుగురాళ్ల.ఆగస్టు 26రాజధాని వాయిస్** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 31న పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీరావు, ప్రిన్సిపాల్ ఎం. వెంకటనరసయ్య తెలిపారు. ఈ డ్రైవ్‌లో విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్ సహా 11 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18--35 ఏళ్ల యువతీయువకులు తమ సర్టిఫికెట్ల జిరాక్స్, ఆధార్, రెజ్యూమ్‌తో హాజరుకావచ్చని, ఎంపికైన వారికి రూ. 14,000 నుంచి రూ. 35,000 వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు https://naipunyam.ap.gov.in లో నమోదు చేసుకోవాలని, వివరాలకు 9492158153, 80743 93466 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పిన్నెల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కిల్లా రత్నకుమారి



**కారంపూడి, ఆగస్టు 26రాజధాని వాయిస్:** పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కారంపూడికి చెందిన కిల్లా రత్నకుమారి బుధవారం మాచర్లలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పలువురితో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, రత్నకుమారి దంపతులు పిన్నెల్లిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశా రు.అనంతరం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కూడా నూతన ఉపాధ్యక్షు రాలిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా పిన్నెల్లి మాట్లాడుతూ,పదవికి వన్నె తెచ్చేలా బాధ్యతగా పనిచేస్తూ, అందరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పలువురు స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com